క్లుప్తంగా

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న కొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లి గ్రామంలో లింగనిర్ధారణ చట్టంపై అవగాహన సదస్సుతో పాటు వైద్యసిబ్బంది మంగళవారం ర్యాలీ చేపట్టారు. పెద్దకొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ మాట్లాడుతూ ఎవరైనా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తే చట్టం ప్రకారం చర్యలుంటాయన్నారు. ప్రజల అపోహలు, మూఢనమ్మకాలను ప్రైవేట్ నర్సింగ్ హోంలు, స్కానింగ్ కేంద్రాలు సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. అనంతరం ఆడపిల్లను పుట్టనిద్దాం, పెరగనిద్దాం అంటూ గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ గోవిందు, సూపర్‌వైజర్లు చౌడప్ప, నాగరత్న, ఎంఎల్‌హెచ్‌పీ చందన, ఏఎన్‌ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న వెటర్నరీ ఏడీ రామసుబ్బారెడ్డి

గుమ్మఘట్ట: గొర్రెలు, మేకలు పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు సాధ్యమని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శ్రీలక్ష్మి మహిళా మండలి సమాఖ్య కేంద్రంలో జాతీయ పశుగణ మిషన్ సౌజన్యంతో సన్నజీవాల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి పెంపకందారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్యాపిలి పశువైద్యులు శ్రీనివాసులు, ఆలీ, గుమ్మఘట్ట పశువైద్యుడు నవీన్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలను పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ ఏడుకొండలు సూచించారు. స్థానిక పెన్షనర్ల భవనంలో మంగళవారం బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.2 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. ఏటీఎం కలిగిన వారికి ప్రమాదంలో మరణిస్తే బీమా వర్తిస్తుందన్నారు. పెన్షనర్ల సమస్యలపై వెంటనే స్పందించాలని మేనేజర్‌ను కార్యదర్శి తిప్పేస్వామి కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శివప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.


మొక్కల సంరక్షణకు చర్యలు



ఐదుకల్లు ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షానవాజ్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి ఐదుకల్లు ఫారెస్ట్‌లో మంగళవారం మొక్కల రీ ప్లాంటేషన్ చేయించారు. గతంలో నాటిన మొక్కల స్థానంలో చనిపోయిన మొక్కలకు బదులుగా 500 కొత్త మొక్కలను నాటించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మనవతా బ్లడ్ డోనర్స్ సంస్థ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్, మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. రక్తదానంతో ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరేష్, మానవతా బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ కో కన్వీనర్ సలీం, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్, రాయదుర్గం శాఖ కార్యదర్శి జగదీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ చరిత్రాత్మకం

- ఇల్లు లేని పేదలు ఉండకూడదనేదే సీఎం జగన్ లక్ష్యం
- పయ్యావుల కేశవ్ పచ్చి మోసగాడు
- ఇంటి పట్టాల పంపిణీ సభలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఉరవకొండ పట్టణంలో కనీవిని ఎరుగని రీతిలో 3 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, ఇది చరిత్రాత్మకమని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రైతుల అభ్యంతరాలు, కోర్టు కేసులు వీగిపోవడంతో పట్టణంలో దాదాపు 15 ఏళ్లుగా నిలిచిపోయిన పేదలకు ఇంటి పట్టాల కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన పట్టాల పంపిణీ సభకు ఉరవకొండ తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ అమృతరాజ్ అధ్యక్షత వహించారు. కోర్టు వివాదంలో ఉండి వీగిపోయిన ఈద్గా వద్ద ఉన్న 589–5 సర్వేనెంలో 252 మంది లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అందుకే దశాబ్దాలుగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 31 లక్షల ఇంటి పట్టాలు పంపిణీ చేసి చూపించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలోనే రూ.200 కోట్లు వివిధ పథకాల ద్వారా పేదలకు అందాయన్నారు. గత ఎన్నికల్లో గెలుపొందేందుకు కేశవ్ దిగజారుడు రాజకీయాలు చేశారని, 14 సర్వే నంబర్లతో నకిలీ పట్టాలు అందించారన్నారు. కేశవ్‌లాంటి మోసగాళ్లకు ఈసారి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్‌యార్డు చైర్మన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, బీసీ సెల్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, బసవరాజు, పార్టీ పట్టణ, మండల, రూరల్ కన్వీనర్లు ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, ముస్తూరు సుంకన్న, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, జెడ్పీ మాజీ తిప్పయ్య, యువనేత సింగాడి ధనరాజ్, వశికేరిమల్లి, కోఆప్షన్‌సభ్యులు సలీం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలాలు

అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ఇంటిస్థలాలు అందించేందుకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు జర్నలిస్టులతో కలిసి ఇంటిస్థలాలపై సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులకు కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో ఉందని, మరో వారం రోజుల్లో కోర్టులో క్లియరెన్స్ కాగానే అక్రిడిటేషన్ కల్గిన జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం అందిస్తామన్నారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ మూడు సెంట్లు స్థలం ఇవ్వడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం జర్నలిస్టులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆర్‌డీఓను సత్కరించారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



కుందుర్పి ఎస్‌ఐ ఎర్రిస్వామి



కంబదూరు ఎస్‌ఐ విజయభాస్కర్

కుందుర్పి/కంబదూరు: కుందుర్పి ఎస్‌ఐగా ఎర్రిస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి ఇటీవల వీఆర్‌కు వెళ్లడం తెలిసిందే. జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న ఎర్రిస్వామిని ప్రభుత్వం కుందుర్పి ఎస్‌ఐగా నియమించింది. అలాగే కంబదూరు మండల ఎస్‌ఐగా విజయభాస్కర్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రాజేష్ పెనుగొండకు బదిలీ కావడంతో.. ఆ స్థానంలో అనంతపురంలో వీఆర్‌లో ఉన్న విజయభాస్కర్ ఇక్కడికి ఎస్‌ఐగా వచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

కుందుర్పి: మండలంలోని నాగేపల్లిలో తాగునీటి సమస్యను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం ఆ గ్రామస్తులు గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రం అందజేయగా ఎంపీడీఓ, పంచాయితీ కార్యదర్శులు శ్రీమజ్జనపల్లి చెరువులో ఉన్న మంచినీటి పథకాలను పరిశీలించారు. గ్రామంలో బోరు వేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని అధికారులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

రేపటి నుంచి ‘వై ఏపీ నీడ్స్ జగన్’



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ ‘వై ఏపీ నీడ్స్ జగన్’ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.ఈ మేరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమం అమలుపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలు ఏ రకంగా సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారో చూపించే బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల సంక్షేమానికి సంబంధించిన బుక్‌లెట్లు వస్తాయని వాటిని వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి అందజేయాలన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితోపాటు చైర్‌పర్సన్, కౌన్సిలర్లు హాజరవుతారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్ ఫక్రుద్దీన్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలో గురువారం నుంచి ఈనెల 23 వరకు ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగనే మళ్లీ ఎందుకు కావాలి ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9న అంకంపల్లి, నక్కలపల్లి, బెళుగుప్ప–1,, 10న బెళుగుప్ప–2, రామసాగరం, 14న దుద్దేకుంట,15న గంగవరం,16న హనిమరెడ్డిపల్లి,17న గుండ్లపల్లి, నరసాపురం, 20న శీర్పి, 21న శ్రీరంగాపురం, 22న తగ్గుపర్తి, ఎర్రగుడి, 23న కాలువపల్లిలో కార్యక్రమాలుంటాయన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులను బుధవారం నుంచి 23వ తేదీ వరకూ ఆవిష్కరిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. వై నాట్ జగన్ బ్రోచర్లను గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యక్షులు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

పొగ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

బొమ్మనహాళ్: పొగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు గీతాభార్గవి, కుమారరాజా అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో పొగాకు రహిత సమాజంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధూమపానం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, నోటి క్యాన్సర్, గొంతు కాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే రక్తపోటు పెరగడంతో పాటు గుండె జబ్బులకు దారితీస్తుందన్నారు. విద్యార్థులు , యువకులు దుమపానానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శివప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, నాగరత్నమ్మ, ఎర్రమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దిశ యాప్ మహిళలకు శ్రీరామరక్ష

శెట్టూరు: మహిళా రక్షణకు దిశయాప్ శ్రీరామరక్ష అని ఎస్‌ఐ రాంభూపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో ప్రయాణికులకు దిశయాప్ డౌన్‌లోడ్, ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దిశయాప్‌ను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కూడేరు: మండల కేంద్రంలోని కలగళ్ల రోడ్డు క్రాస్ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన పోలీసులు నిర్వహించిన ‘దిశా’ యాప్ డౌన్ లోడ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి మహిళల నుంచి స్పందన లభించింది.మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ స్మార్ట్ ఫోన్లలో దిశా యాప్‌ను డౌన్ లోడ్ చేయించుకున్నారు. మహిళా పోలీసులు వెంకటలక్ష్మమ్మ (కూడేరు), మాధవి(ఇప్పేరు) సునీత (కొర్రకోడు), కానిస్టేబుల్స్ నరసింహరాజు, తిప్పేస్వామి ,నాగార్జునలు దిశా యాప్ ప్రయోజనం గురించి మహిళలకు అవగాహన కల్పించారు.

మండల వైద్యాధికారిణికి వీడ్కోలు



వైద్యాధికారిణి సరితను సన్మానించిన సిబ్బంది

కూడేరు: మండల వైద్యాధికారిణి సరిత నీట్ పీజీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి కంటి సంబధిత ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్తున్నారు. మంగళవారం మండల వైద్య సిబ్బంది కూడేరు పీహెచ్‌సీలో ఆమెకు ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు . ఆమెకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు కార్యక్రమంలో వైద్యాధికారి–2 లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్టు వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



రాయదుర్గంటౌన్: లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కూడేరు: మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ హనుమప్ప

రాయదుర్గంటౌన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని 1వ సచివాలయంలో జగనన్న లేఅవుట్లలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అన్ని వసతులు కల్పించామన్నారు. బిల్లులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేకదృష్టి సారించారన్నారు. ఇంకా నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జయచంద్ర, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివకుమార్, భీమనపల్లి దివాకర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కూడేరు: ఈ నెలాఖరుకు 300 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ డీఈ హనుమప్ప ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జనన్న గృహ నిర్మాణం పథకం కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై ఆయన సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా ఇంకా 678 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అవకతవకల గుర్తింపు

కంబదూరు: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీలో వెల్లడైయింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.7 కోట్లతో జరిగిన 686 పనులపై 13 రోజుల పాటు సామాజిక బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారు. తనిఖీలో బయట పడిన అవకతవకలను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బహిరంగ ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు బహిర్గతం చేశారు. రూ.3.26 లక్షలు రికవరీకి అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ మధు, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ ఆఫీసర్ రమణరెడ్డి, ఎస్‌ఆర్‌పీ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ సుధాకర్‌రాజు, ఏపీఓ ఉస్మాన్ ఆలీ పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఎంపిక

రాయదుర్గం రూరల్: ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ పోటీలకు బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న వై.రాజేష్ ఎంపికైనట్లు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మంగళవారం తెలిపారు. కేరళలోని తిరువనంతపురం యూనివర్సిటీలో ఈనెల 13 నుంచి 18 వ తేదీ వరకూ జరిగే బాస్కెట్ బాల్ పోటీల్లో ఎస్కేయూ జట్టు తరపున విద్యార్థి పాల్గొంటారన్నారు.

అప్రమత్తంగా ఉండండి

విడపనకల్లు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. నివాసాల ఎదుట మురుగు ,చెత్తాచెదారం లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం జాతీయ కీటక, జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ రాజేంద్ర,ఆరోగ్య సూపర్‌వైజర్లు కంబయ్య, కేసీ మునెమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌బాషా, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని పాతచెరువుకు చెందిన మల్లికార్జున రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంలో పాతచెరువు నుంచి గోళ్ల గ్రామానికి వెళ్తుండగా కటువ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనదారుడు మల్లికార్జునను ఢీ కొన్నాడు. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో అనంతపురానికి తీసుకెళ్లారు. ఫిర్యాదు మేరకు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సెపక్‌తక్రా బాల, బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జట్లతో పీడీలు

ఉరవకొండ: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించి బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఉరవకొండలోని పోలీసు క్రీడా మైదానంలో చేపట్టిన ఎంపికలకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన అండర్– 14 బాలికల జట్టులో పవిత్ర, సుస్మిత (కేజీబీవీ, తత్రకల్లు) వైష్ణవి, హారిక (కరకముక్కల), బాలుర జట్టులో రాజు, సాహిద్, రేవంత్, చంద్రశేఖర్‌నాయక్, యుగాంధర్ ఉన్నారు. అలాగే అండర్–17 బాలికల జట్టులో రమ్య, మల్లికా, సురేఖ (కేజీబీవీ, తత్రకల్లు) హనీ (హిందూపురం), బాలుర జట్టులో మోసెస్, పులింద్ర, చిదానంద, వంశి, ఇంతియాజ్ చోటు దక్కించుకున్నారు. అండర్–19 బాలికల జట్టుకు మానస, స్పందన (కేజీబీవీ, తత్రకల్లు) నీలిమ, రేణుక, బాలుర జట్టుకు సుదర్శన్, బాలకృష్ణ, మణికంఠ, వంశి, కార్తీక్ ఎంపియ్యారు. ఎంపికలను పీడీ మారుతి, ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, సెపక్‌తక్రా జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, షాహిన్, హెచ్‌ఎం రాజేశ్వరి పర్యవేక్షించారు.

తక్షణసాయం అందజేత

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన బోయ బొమ్మన్న అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ కుర్రా రాము, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులతో కలసి మంగళవారం మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మిగిలిన మొత్తం నామినీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో గృహసారథులు భీమలింగ, పురుషోత్తం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

కణేకల్లు: మండలంలోని పుల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి (37) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ఆయనకు 4.50 ఎకరాల పొలముంది. ఏటా వేరుశనగ, ఆముదం పంట సాగు చేసేవాడు. ఈ ఏడాది ఆముదం పంట సాగు చేసి నష్టపోయాడు. ఈ క్రమంలో పంటల సాగు కోసం చేసిన అప్పులు, వడ్డీ రూ.8 లక్షల వరకూ పేరుకుపోయాయి. అప్పులిచ్చినోళ్ల ఒత్తిడి చేయడంతో శ్రీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కంపచెట్ల తొలగింపు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామం నుంచి ఎన్.తిమ్మాపురం గ్రామానికి వెళ్లే రహదారి పొడవునా పెరిగిన కంపచెట్లును ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీతో తొలగించారు. దీంతో ఎన్.తిమ్మాపురం గ్రామస్తులు ఎంపీపీ, సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాశంకర్, ధనుంజయ, శివారెడ్డి, తిప్పేరుద్ర, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసానాయక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతు కళ్లలో దీపావళి కాంతులు

- పండుగకు ముందే పెట్టుబడి సాయం అందజేత
- మూడు నియోజకవర్గాల్లో 1,52,232 మంది రైతులకు లబ్ధి



రాయదుర్గం: అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. విత్తు నుంచి విపత్తు దాకా అన్ని విధాల ఆదుకునే చర్యలు చేపట్టారు. తాజాగా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఐదో ఏడాదిలో రెండో విడత పెట్టుబడి సాయాన్ని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ కారణంగా పండుగకు ముందే ‘రైతు కళ్లల్లో దీపావళి కాంతులు’ విరజిమ్మాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని 1,52,232 మందికి రూ.61.98 కోట్లు ఖాతాల్లోకి జమయ్యాయి. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లోని రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	రైతులు	జమ చేసిన మొత్తం
రాయదుర్గం	45,789	రూ.18.79 కోట్లు
కళ్యాణదుర్గం	54,944	రూ.22.05 కోట్లు
ఉరవకొండ	51,499	రూ. 21.14 కోట్లు

సీఎం జగన్ కు రుణపడి ఉంటాం



రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 నగదు జమచేస్తూ వ్యవసాయ రంగానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి అనేక పథకాలను ఊళ్లోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. బటన్ నొక్కగానే చాలా మందికి నగదు జమైంది. రైతులంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

అంజిరెడ్డి, రైతు, నాగలాపురం, డి హీరేహాళ్ మండలం